డెంగ్యూతో చిన్నారి మృతి

రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతురు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రుషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతురు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు • 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా? • మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్

రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం • ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే • బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్పున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టా లిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ఆశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురికేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగోడుతామంటే బీఆర్ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింత మడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చు నన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.

హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

• తాగునీటి కోసం గిరిజనుల నిరసన

మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి

తహసీల్ పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పిచ్చి మొక్కల తొలగింపు

వాజేడు, సెప్టెంబర్ 30 : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో సోమవారం సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. 'నమస్తే తెలంగాణ'లో సోమవారం 'సర్కారు కార్యాలయాల్లో స్వచ్ఛత కరువు..' కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్ కార్యాలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను నాగారం పంచాయతీ సిబ్బంది తొలగించి జీపీ ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు. అలాగే పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్కలను తొలగించేందుకు వెళ్లగా అటెండర్ జీ సాయిబాబు అడ్డుకొని దూషించాడని సిబ్బంది తెలిపారు. ఇందుకు నిరసనగా పరిసరాలను శుభ్రం చేయడంలేదని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయనున్నట్లు సిబ్బంది ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

జీసీసీ మేనేజర్ హరిలాల్‌కు సన్మానం

మహదేవపూర్, సెప్టెంబర్ 30 : మండలకేంద్రంలోని గిరిజన సహకార సంస్థలో పనిచేసిన మేనేజర్ హరిలాల్ ఉద్యోగ విరమణ పొందడంతో కు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో హరిలాల్ దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా మేనేజర్‌గా విధులు నిర్వర్తించి తోటి ఉద్యోగులు, ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో జీసీసీ హెడ్ ఆఫీస్ మేనేజర్ సత్యనారాయణ, డీఎం ప్రతాప్‌రెడ్డి, జీసీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్క రాజుకు సేవారత్న అవార్డు

వెంకటాపూర్/వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 30: మండలంలోని పాలంపేటకు చెందిన మార్క రాజుకు భారతీయ స్ఫూర్తి సేవారత్న నేషనల్ అవార్డును ఆసియా వేదిక్ అంతర్జాతీయ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ వారు అందజేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాల ఏర్పాటు, గర్భిణులకు సాయం అందించడం, బ్లడ్ మోటివేటర్‌గా, సోషల్ యాక్టివిస్టుగా చేసిన సేవలకు వార్డును హైదరాబాద్‌లోని కోటిలో సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో డాక్టర్ ఆకుల రమేశ్ అందజేశారు. అదేవిధంగా చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చీడెం సాయి ప్రకాశ్‌కు సోషల్ సర్వీసెస్ డాక్టరేట్ అవార్డు, స్ఫూర్తి సేవారత్న నేషనల్ అవార్డును అందజేశారు. తాను చేస్తున్న సేవలను గుర్తించి అవార్డులు అందజేసినట్లు సాయిప్రకాశ్ తెలిపారు.

అంబట్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎన్‌హెచ్‌ఎం టీం సభ్యులు

మహదేవపూర్, సెప్టెంబర్ 30 : మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం నేషనల్ హెల్త్ మిషన్ సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. రోగులకు సక్రమంగా వైద్య పరీక్షలకు జరుగుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీడీవో డాక్టర్ మౌనిక, డాక్టర్లు జగదీశ్, విజయ్‌కుమార్, రఘువరన్, హెల్త్ సూపర్‌వైజర్ మాషూక్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో బతుకమ్మ పండుగ వేడుకలు

కాటారం, సెప్టెంబర్ 30 : బతకుమ్మ పండుగ పురస్కరించుకొని మండలకేంద్రంలోని కేజీబీవీలో సోమవారం ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చల్ల సునీత, విజయ, సరిత, అరుణ, నళిత, కవిత, శిరీష, లక్ష్మి, మణిమాల, రాజమణి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వం

తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ర్యాలీగా వస్తున్న నాయకులు, గిరిజనులు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 30 : ఆదివాసీల చట్టాలు, సంక్షేమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పది మంది ఎమ్మెల్యేలతో కలిసి ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేసి తీర్మానం చేసిన 29 శాఖలతో కూడిన చట్టం చేసేలా మంత్రి సీతక్క సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వై జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ తీసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌తో పాటు ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి మాట్లాడుతూ మెగా డీఎస్సీ కాకుండా ఏజెన్సీ డీఎస్సీ ఏర్పాటు ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2023 ఎన్నికల ముందు మంత్రి సీతక్క తుడుందెబ్బ రాష్ట్ర కమిటీని పిలిపించి సీఎం రేవంత్‌రెడ్డితో కూర్చుని చర్చించారని, ఎన్నికల్లో తమకు సపోర్టు చేస్తే ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఏజెన్సీ డీఎస్సీ, 29 శాఖల జీవోలతో చట్టం చేయడం, ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం, ఐటీడీఏలను బలోపేతం చేయడం, లంబాడా ఆదివాసీ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని, పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ, ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను పీవో చిత్రమిశ్రాకు అందించారు. ధర్నాలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబెల్లి గణేశ్, తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ పొడెం బాబు, ఉపాధ్యక్షుడు పులిసె బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కోరగట్ల లక్ష్మణ్ రావు, నాయకులు పొడెం నగేశ్, కోటేశ్వర్‌రావు, పొడెం శోభన్, కబ్బాక లక్ష్మణ్, ఆలం నగేశ్, మోకాళ్ల వెంకటేశ్, వంక నరేశ్, ఎట్టి సారయ్య, సుధాకర్, అర్జున్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

కాటారం, సెప్టెంబర్ 30 : మండలంలోని గారెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో సమస్యలు, పీఏసీఎస్ అభివృద్ధిపై చర్చించారు. కాటారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేక సరైన మద్దతు ధర అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రుణమాఫీ అమలు కాని వారికి అందేలా చూడాలని పలువురు రైతులు సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్కెట్ యార్డు వద్ద కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని తీర్మానించారు. చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా చూశామన్నారు. తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని, సకాలంలో రుణాలు చెల్లించి సంఘం బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం, సెప్టెంబర్ 30: మహాముత్తారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం సోమవారం చైర్మన్ సోమ శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఒకే వేదికపై తీసుకొచ్చి సహకార సంఘాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ వెల్మరెడ్డి అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు లింగమల్ల చిన్న రాజయ్య, వెంకట్‌రెడ్డి, అజ్మీరా సుజాత, తూడి భాస్కర్‌రెడ్డి, వేల్పుల సమ్మక్క, రాజయ్య, మల్లమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ డ్రామా ప్రదర్శన

ములుగురూరల్, సెప్టెంబర్ 30: ములుగు జిల్లా కేంద్రంలోని సెయింట్ అంథోనిస్ పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పెస్టివల్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, ఎంఈవో శ్రీనివాసులు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యారవ కవితారెడ్డి, డైరెక్టర్లు బొల్లం రవి, కందాల రమేశ్, సానికొమ్ము వెంకటప్పరెడ్డి, ఏళ్ల మధుసూదన్, రఫీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న జయదేవ్, శ్రీనివాసులు

నియామక పత్రం అందుకుంటున్న దేవేందర్

కేటీఆర్ సేన సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్

టేకుమట్ల, సెప్టెంబర్ 30 : మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన కుకట్ల దేవేందర్ కేటీఆర్ సేన సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైట్లు జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నింటి మణిదీప్ ఒక ప్రకటలో తెలిపారు. అలాగే సోషల్ మీడియా టేకుమట్ల మండల అధ్యక్షుడుగా చెలకాని రాకేశ్‌ని సైతం ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యం

జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 30: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ అనివార్యమని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించిన ఏఆర్ ఎస్సైలు ఇనుగాల పాపిరెడ్డి, ఎండీ జలాలుద్దీన్, పోరెడ్డి రాజిరెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాయభారపు శ్రీనివాసులు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ అవుతున్న ఉద్యోగులకు ఎస్పీ పూల మాలలు వేసి, శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ బోనాల కిషన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు నగేశ్, శ్రీకాంత్, రత్నం, కిరణ్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ మృతి

మంగపేట సెప్టెంబర్30 : మాజీ ఎంపీపీ, కమలాపురం మాజీ సర్పంచ్ కల్యాణపు ఆగయ్య (74) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. గతంలో కమలాపురం బిల్ట్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేసిన ఆగయ్య సీపీఎం నుంచి కమలాపురం– 2 ఎంపీటీసీగా గెలిచి మంగపేట ఎంపీపీగా పని చేశారు. దీనికి ముందు కమలాపురం మేజర్ పంచాయతీలో సర్పంచ్‌గా కూడా సేవలందించారు. అనంతరం దివంగత మంత్రి చందూలాల్ హయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరి క్రీయాశీలకంగా పని చేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైన ఆగయ్య వైద్య చికిత్స తీసుకుంటున్నారు. ఈక్రమంలో అస్వస్థతకు లోనవడంతో హనుమకొండలోని ఓ దవాఖానలో చేర్పించగా గుండెపోటుతో మృతి చెందాడు. బీఆర్ఎస్‌తో పాటుగా వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు సంతాపం తెలిపారు.

నేడు డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 30 : డీఎస్సీ–2024 పరీక్ష రాసిన జిల్లాలోని అభ్యర్థులకు స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ నుంచి మెసేజ్, మెయిల్ వస్తున్నదని డీఈవో రాజేందర్ సోమవారం